ప్రత్యేక పూజలు



అభిషేకం చేస్తున్న రవికుమార్ యాదవ్

మియాపూర్: కార్తీక మాసం సోమవారం సందర్భంగా మియాపూర్ హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీలోని సాయిబాబా ఆలయంలో స్వామి వారికి మహా రుద్రాభిషేకం ,రుద్రహోమం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

జేఎన్‌టీయూ - కూకట్‌పల్లి వరకు సర్వీస్ రోడ్డు వేయాలి

కాంగ్రెస్ నాయకుడు ఏకాంత్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: జేఎన్‌టీయూ నుంచి కూకట్‌పల్లి వరకు సర్వీస్ రోడ్డు వేయాలని కోరుతూ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు కాంగ్రెస్ నాయకుడు ఏకాంత్‌గౌడ్ సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఎన్‌టీయూ నుంచి కూకట్‌పల్లి వరకు ముంబై హైవై రోడ్డులోని సర్వీస్ రోడ్డులో కరెంటు పోల్స్, అక్రమ పార్కింగ్‌లను తొలగించి సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్‌కు శాశ్వత పరిష్కారం చూపించినట్లు అవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జితేందర్, డివిజన్ సీనియర్ నాయకులు బొట్టు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించని వారే ఎక్కువ..

- ఈ ఏడాది జనవరి– అక్టోబర్ వరకు 33 వేల కేసులు నమోదు
- నంబర్ ప్లేట్ 2,414 కేసులు, డ్రైవింగ్ లైసెన్స్ 3,856 కేసులు
- హెల్మెట్ వినియోగించని కేసుల్లో... పటాన్‌చెరు టాప్

పోలీసులు చలాన్‌లు విధిస్తున్నా కనిపించని మార్పు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రమాదాల సమయంలో తలకు గాయాలు కాకుండా కాపాడుతుందని తెలిసినా పట్టించుకోవడం లేదు. ఇక చలాన్‌ల నుంచి తప్పించుకోవడానికి వాహనాల నంబర్లను ట్యాంపరింగ్ చేస్తున్నారు. కేసులు నమోదవుతున్నాయని తెలిసినా, తనిఖీ చేసిన సమయంలో చూసుకోవచ్చనే బాధ్యతారాహిత్యాన్ని కనబరుస్తున్నారు. పటాన్‌చెరు పరిధిలో యువతపై నమోదవుతున్న కేసులే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. హెల్మెట్ వినియోగించని కేసుల్లో... పటాన్‌చెరు టాప్‌లో ఉంది.

నంబర్ ట్యాంపరింగ్‌తో..

మార్కెట్‌లోకి కొత్త వాహనాలు రాగానే కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్న యువత కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదు. నంబర్ ప్లేట్లపై స్టిక్కర్లు వేయడం, అక్షరాలు కనిపించకుండా చేయడం, మాస్కులు కట్టడం మధ్యలో నంబర్ తొలగించడంలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. నంబర్ ట్యాంపరింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు నష్టపోయేది వాహనదారులే, వాహనం ఎవరిది... ప్రమాదానికి కారకులు ఎవరో తెలియదు.. బాధితునికి బీమా రాకుండా పోయే అవకాశం ఉంది. ప్రమాద సమయంలో నంబర్ ప్లేట్ సరిగా లేకుంటే న్యాయం జరిగే అవకాశం ఉండదు. చాలామంది వాహనదారులు పోలీస్ చలాన్లు తప్పించుకునే విషయంలో ఇతర వాహనాల నంబర్లతో తిరుగుతున్నారు. పోలీసుల తనిఖీలలో పట్టుబడుతూ కేసులు ఎదుర్కొంటున్నారు. నిబంధనలకు అనుగుణంగా నంబర్ ప్లేట్ బిగించుకోవాలని పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై

ఇవి తప్పనిసరి..

వాహనదారుల వద్ద లైసెన్స్, ఆర్‌సీ, బీమా, కాలుష్య నియంత్రణ పత్రాలు ఉండాలి. తలకు తప్ప ఎక్కడ గాయాలైనా బతకడానికి అవకాశం ఉంటుంది. హెల్మెట్ ధరిస్తే తలకు రక్షణ ఉంటుంది. లైసెన్స్ లేకుండా వాహనం నడిపి ప్రమాదం జరిగినప్పుడు శిక్ష ఎక్కువ పడే అవకాశం ఉంటుంది. వాహనానికి బీమా ఉంటే ప్రమాదం జరిగినప్పుడు వాహనంతో పాటు బాధితునికి కూడా వర్తిస్తుంది.

హెల్మెట్ వినియోగించని కేసుల్లో..

వాహనాల నంబర్ ట్యాంపరింగ్ చేసి తిరుగుతున్న వారిని పోలీసులు గుర్తిస్తున్నారు. వాహనం స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేస్తున్నారు. ఇటీవల ఇలాంటి కేసులు ఎక్కువగా వెలుగు చూస్తున్నాయి. పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఏడాది జనవరి నుండి అక్టోబర్ వరకు 33, 308 హెల్మెట్ ధరించని కేసులు, నంబర్ ప్లేట్ వినియోగించని 2,414 కేసులు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారిపై 3,856 కేసులను ట్రాఫిక్ పోలీసులు నమోదు చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. ఇతర వాహనాల నంబర్లను ఉపయోగించుకోవడం, నంబర్లను తొలగించడం సరైన పద్ధతి కాదు .పటాన్‌చెరు వ్యాప్తంగా చేపట్టిన వాహన తనిఖీల్లో నంబర్ ప్లేట్ వినియోగించని 2,414 వాహనాలపై కేసులు నమోదు చేశాం. చాలా వరకు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం లేదు. హెల్మెట్ ధరించాలని, వాహనదారులు నిబంధనలు పాటించాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

–ట్రాఫిక్ సీఐ లాలూనాయక్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వైట్‌ఫీల్డ్ ఏఈ కిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గచ్చిబౌలి మెయిన్ రోడ్డు, ఏఐజీ హాస్పిటల్ బ్యాక్ సైడ్, బాబుఖాన్ లేన్, మహరాజా హోటల్, ఆర్‌వీ శిల్ప, ఎన్‌సీసీ అర్బన్, ఒమేగా హాస్పిటల్ పరిసరాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఆల్విన్‌కాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం 11 కెవి వినాయక ఫీడర్ పరిధిలో పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు శాతవాహన నగర్‌లో కరెంట్ ఉండదని తెలిపారు.

చందానగర్‌లో..

చందానగర్: పాపిరెడ్డినగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దీప్తి పేర్కొన్నారు.

◆ మార్కెట్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సీఎం తోట, ప్రేమ్‌నగర్ బీ బ్లాక్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

హెచ్‌సీయూ విజిటింగ్ చైర్ ప్రొఫెసర్‌గా అరుణ్‌ఘోష్



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని ప్రొఫెసర్ గోవర్ధన్ మెహతా విజిటింగ్ చైర్ ప్రొఫెసర్‌గా అమెరికాలోని ఫరీద్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అరుణ్‌ఘోష్‌కు అవకాశం లభించిందని సోమవారం హెచ్‌సీయూ ఒక ప్రకటన విడుదల చేసింది. అమెరికాలో ప్రొఫెసర్ అరుణ్ ఘోష్ ఇయాన్ పి.రోత్‌వెల్ విశిష్ట ప్రొఫెసర్‌గా, ఆర్గానిక్ కెమిస్ట్రీ విభాగంలో పనిచేస్తున్నారు. ఆయన పరిశోధనా బృందం సింథటిక్ ఆర్గానిక్, బయో ఆర్గానిక్, మెడిసినల్ కెమిస్ట్రీ రంగాలలో మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ ప్రాజెక్టులలో పాల్గొంటోంది. ప్రొఫెసర్ గోవర్ధన్ మెహతా విజిటింగ్ చైర్ ప్రొఫెసర్‌షిప్ కెమిస్ట్రీలో ప్రఖ్యాత శాస్త్రవేత్తలు/ప్రొఫెసర్లకు ఇవ్వబడుతుంది.ఒక ఏడాది కాలంలో వరుసగా ఇద్దరు సందర్శకులను నియమించవచ్చు.

ప్రజావాణి.. 8 వినతులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 8 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. టౌన్ ప్లానింగ్ సెక్షన్‌కు 5, శానిటేషన్ 2, అర్బన్ బయోడైవర్సిటీకి 1 ఫిర్యాదు వచ్చినట్లు వివరించారు.

విద్యాభివృద్ధికి బాటలు వేసిన మహనీయుడు ఆజాద్



ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆచార్య కృష్ణ తదితరులు



వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు

శేరిలింగంపల్లి: దేశంలో విద్యాభివృద్ధికి బాటలు వేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్యులు రావుల కృష్ణ అన్నారు. జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆజాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే కృషి, పట్టుదలతో గుణాత్మక విద్యను అందిపుచ్చుకోవాలన్నారు. 6 ఏళ్ల నుంచి 14 ఏళ్ల చిన్నారులకు నిర్బంధ విద్య ఉండాలని, హిందూ, ముస్లింల ఐక్యతకు ఆజాద్ కృషి చేశారన్నారు. కార్యక్రమంలో తాడిబోయిన రామస్వామియాదవ్, సభ్యులు అమ్మయ్య చౌదరి, పాలం శ్రీను, జిల్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో..

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీ, బాలానగర్ బాయ్స్ 1లో భారతరత్న, తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ జితేందర్, నర్సింహులు, ఉపాధ్యాయులు చంటి, విశాలవాణి, సతీష్, శరణ్య, వాసు, నర్సింహ, హబీబ్, వెంకటేశం, శ్రీనివాస్, గోపాల్ పాల్గొన్నారు.

ఆలయంను తొలగించే ప్రసక్తే లేదు

బీజేపీ శేరిలింగంపల్లి ఇంచార్జ్ రవి కుమార్‌యాదవ్

గచ్చిబౌలి: కొండాపూర్ డివిజన్‌లోని రాజీవ్‌నగర్‌లో శివాలయం నిర్మాణంలో ఉందని, రోడ్డు పేరిట ఆలయాన్ని తొలగించాలనడం తగదని, ఆలయాన్ని తొలగించమని బీజేపీ శేరిలింగంపల్లి ఇంచార్జీ ఎం.రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. సోమవారం రాజీవ్‌నగర్‌లో ఆయన పర్యటించారు. ప్రైవేట్ ఆస్పత్రికి రోడ్డు ఉందని స్థానికులను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, ఎన్నో ఏళ్ల నుంచి ఆలయం ఉందని, కొత్తగా రోడ్డు ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. అవసరమైతే సమస్యను కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ల దృష్టికి తీసుకెళుతానని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆంజనేయులు సాగర్, మన్యం కొండ సాగర్, మల్లేష్, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు ఎనలేనివి



కొండాపూర్ 8వ బెటాలియన్‌లో నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. కమాండెంట్ సీ సన్నీ ఆధ్వర్యంలో సర్దార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కమాండెంట్ బివిరెడ్డి, సహాయ కమాండెంట్ ఎం నాగభూషణం, బి సిత్రం, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

25 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన, జైలు విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 25 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా 25 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి



ఆల్విన్‌కాలనీ: సమగ్ర సర్వేలో భాగంగా వివేకానందనగర్ సప్తగిరి కాలనీలోని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఇంటి వద్ద డీసీ కృష్ణయ్య, జీహెచ్‌ఎంసీ అధికారులు సోమవారం సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. ప్రజలందరూ సిబ్బందికి సహకరించాలన్నారు. ఆధార్, బ్యాంక్ ఖాతా, మొబైల్ నంబర్‌లతో పాటు స్థిరాస్తి, వాహనాల వివరాలు, తీసుకున్న రుణాలు అన్ని వివరాలు సేకరించి ప్రభుత్వానికి అందజేస్తారని, భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. అధికారులు ఖచ్చితత్వంతో కూడిన సర్వే నిర్వహించాలని ఎమ్మెల్యే గాంధీ సూచించారు.

భాగమ్మ యాదవ్‌కు ఘన నివాళులు



నివాళులు అర్పించిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, పీఏసీ చైర్మన్ గాంధీ

గచ్చిబౌలి: కాంగ్రెస్ పార్టీ మాదాపూర్ డివిజన్ సీనియర్ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ మాతృమూర్తి భాగమ్మ యాదవ్‌కు పలువురు నివాళులు అర్పించారు. సోమవారం మాదాపూర్‌లోని బుట్టా కన్వెన్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎర్రగుడ్ల భాగమ్మ యాదవ్ చిత్రపటానికి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, పీఏసీ చైర్మెన్ గాంధీ, ఎమ్మెల్సీ భానుప్రసాద్, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, రాగం నాగేందర్ యాదవ్ తదితరులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు ఎర్రగుడ్ల రాజు యాదవ్, ఎర్రగుడ్ల ప్రభాకర్ యాదవ్, ఎర్రగుడ్ల వెంకట్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్య వ్యక్తిత్వాన్ని రూపొందిస్తుంది



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వీసీ ఐనుల్ హసన్, ప్రొ.కృష్ణకుమార్ తదితరులు

రాయదుర్గం: ఉన్నత విద్య, ప్రస్తుత దుస్థితిని అర్థం చేసుకోవడం అవసరమని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) మాజీ డైరెక్టర్ పద్మశ్రీ కృష్ణకుమార్ పేర్కొన్నారు. సోమవారం గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో మౌలానా ఆజాద్ స్మారక ఉపన్యాసంలో భాగంగా ఉన్నత విద్యను అర్థం చేసుకోవడం , దాని ప్రస్తుత దుస్థితి అనే అంశంపై ఆయన ప్రసంగించారు. విద్య ఆదర్శాలు, విలువలను కలిగి ఉంటుందన్నారు. భారత దేశ స్వాతంత్ర్యపోరాటానికి సంబంధించిన వ్యక్తులలో ఆజాద్ ఒకరని గుర్తు చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన వీసీ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి ఉన్నత విద్య ముఖ్యమని, అది మీ వ్యక్తిత్వాన్ని రూపొందిస్తుందన్నారు. ఈ సమావేశంలో మనూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ ఓఎస్‌డీ–1 ప్రొఫెసర్ షగుఫ్తా షాహీన్, ఓఎస్‌డీ–2 ప్రొఫెసర్ సిద్దిఖీ మహ్మద్ మహమూద్, ఆజాద్ డే వేడుకల చైర్మన్ ప్రొఫెసర్ సయ్యద్ అలీమ్ అష్రఫ్‌జైషీ ప్రసంగించారు.

జర్నలిస్టులకు ఘన సత్కారం

మనూలో నిర్వహించిన సమావేశంలో ప్రొ.కృష్ణకుమార్, వీసీ ఐనుల్‌హసన్ చేతుల మీదుగా సియాసత్ ఉర్దూ దినపత్రిక బ్యూరో చీఫ్ మహ్మద్ రషీదుద్దీన్, యూఎన్ఐ సీనియర్ జర్నలిస్ట్ వాజీద్ ఉల్లాఖాన్‌లను శాలువా, సర్టిఫికెట్‌తో సత్కరించడంతోపాటు సితార–ఏ సహఫత్ అవార్డును అందించారు. అనంతరం ప్రొఫెసర్ ఎస్ఎం అజీజుద్దీన్ హుస్సేన్, ప్రొఫెసర్ ఇంతియాజ్ హుస్సేన్ రచించిన పుస్తకాలను ఆవిష్కరించారు.

'మెడికవర్'లో అవగాహన సదస్సు

మాదాపూర్: న్యుమోనియా చికిత్స ద్వారా నివారించదగ్గ అంటు వ్యాధి అని డాక్టర్ వి.రాజమనోహర్ తెలిపారు. ప్రపంచ న్యుమోనియా దినోత్సవం సందర్భంగా సోమవారం మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యుమోనియా అనేది బాక్టీరియా, వైరస్, ఫంగల్ ఇన్‌ఫెక్షన్ కారణంగా ఏర్పడే ఇన్‌ఫ్లమేటరీ రెస్పిరేటరీ డిజార్డర్ అని తెలిపారు. ఊపిరితిత్తుల గాలి సంచులలో ద్రవం, చీము చేరడం వల్ల శ్వాస తీసుకోవడం కష్టమవుతుందన్నారు. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న చిన్నపిల్లలు, వృద్ధులలో ఎక్కువగా వస్తుందన్నారు. ఈ వ్యాధికి గురైన వారిలో రక్తంతో కూడిన కఫం, చలిజ్వరం, శ్వాసకోశాల్లో నొప్పి, ఛాతీ భాగంగలో నొప్పి, తలనొప్పి, ఆక్సిజన్ లెవల్స్ హెచ్చు తగ్గులు వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలని సూచించారు.

సీఎంఆర్ఎఫ్ మంజూరుపత్రం అందజేత



మంజూరుపత్రాన్ని అందజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి: మాదాపూర్ డివిజన్ ఇజ్జత్‌నగర్‌కు చెందిన ఓరుగంటి శ్యామ్ వైద్యం కోసం సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా మంజూరైన రూ.1,17,500 చెక్కును కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇంచార్జీ వి.జగదీశ్వర్‌గౌడ్ సోమవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, భుజంగం, దొంతి కార్తీక్, భరత్, ప్రదీప్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసిన అరుణ

ఆల్విన్‌కాలనీ: నెహ్రూ జయంతిని పురస్కరించుకుని శ్రీ సాయి అలేఖ్య సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కేపీహెచ్‌బీ యూపీఎస్ డీఎల్ సెంటర్‌లో బాలోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నేటి సమాజంలో బాలికలు ఎలా ఉండాలి అనే దానిపై వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కార్తీక పూజలు

రాయదుర్గం: కార్తీకమాసం సోమవారాన్ని పురస్కరించుకొని శివాలయాల్లో పూజలు చేశారు. శివ నామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో అర్చకుల మంత్రోచ్చారణల మధ్య భక్తుల జయజయ ధ్వానాలతో స్పటిక లింగానికి పాలాభిషేకం చేశారు. అలాగే గచ్చిబౌలిలోని శివసాయి క్షేత్రంలో విశ్వేశ్వరస్వామి వారికి అర్చనలు, అభిషేకం, అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు.





యోగా పోటీలలో హెచ్‌సీయూ విద్యార్థినుల సత్తా



విజేతలతో ఉపాధ్యాయులు

అండర్–14 బాలికల విభాగంలో ముగ్గురికి కాంస్యం

రాయదుర్గం: యోగాసన రాష్ట్ర స్థాయి పోటీలలో గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్ విద్యార్థినులు సత్తా చాటారు. 11వ రాష్ట్రస్థాయి యోగాసన పోటీలలో అండర్–14 విభాగంలో హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్‌లోని శ్రీ వైష్ణవి, చందన, జస్మితాంజలి కాంస్యం సాధించారు. ఈ నేపథ్యంలో సోమవారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్‌లో విద్యార్థినులను ప్రిన్సిపల్ పి మురళి అభినందించారు. భవిష్యత్తులో రాణించాలని సూచించారు. క్యాంపస్ స్కూల్ పీఈటీ, యోగా ఇన్‌స్ట్రక్టర్ ఎం సతీష్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూగర్భజలాల పెంపునకు కృషి చేయాలి


జలమండలి జీఎం బ్రిజేష్‌కుమార్



కొండాపూర్‌లో ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న జలమండలి అధికారులు

గచ్చిబౌలి: భూగర్భ జలాల పెంపు కోసం అందరూ కృషి చేయాలని జలమండలి జీఎం బ్రిజేష్‌కుమార్ సూచించారు. హైదరాబాద్ మెట్రో వాటర్ సీవరేజ్ సంస్థ ఆధ్వర్యంలో కొండాపూర్‌లో అధికారులు సోమవారం పర్యటించారు. ఇంకుడు గుంతలపై ప్రచార రథాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నీటి చుక్క వృథా పోకుండా ఇళ్ల పరిసరాల్లో ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని సూచించారు. ఇంకుడుగుంతలతో నీటి కొరతను అధిగమించ వచ్చన్నారు. ప్రజలలో ఇంకుడుగుంతలపై అవగాహన అవసరమని, భవిష్యత్ తరాల వారికి నీటి పొదుపు ఆవశ్యకతను వివరిస్తూ భూగర్భ జలాలు సమృద్ధిగా పెరిగే ఇంకుడు గుంతల నిర్మాణం తప్పనిసరిగా చేపట్టాలని ఆయన వివరించారు.అనంతరం శ్రీరామ్‌నగర్ బిబ్లాక్, సీ బ్లాక్, కేమో లేట్, సీఎంసీ ఎన్‌క్లేవ్‌లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో డీజీఎం శరత్‌రెడ్డి, కొండాపూర్ ఏరియా మేనేజర్ సందీప్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శంకర్, స్థానికులు పాల్గొన్నారు.

విద్యార్థుల టెంపుల్ టూర్



చిన్నారులకు భగవత్‌తత్వం గురించి వివరిస్తున్న ప్రసాదరావు గురుస్వామి

చందానగర్: టెంపుల్ టూర్‌లో భాగంగా సోమవారం చందానగర్ దీప్తిశ్రీనగర్‌లోని ది మాస్టర్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు గంగారంలోని అయ్యప్ప స్వామి ఆలయంను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు గురుస్వామి చిన్నారులకు అయ్యప్ప స్వామి గురించి, భగవత్ తత్వం గురించి వివరించారు. విద్యార్థులకు మన సంస్కృతికి సంబంధించిన విషయాలు కూడా తెలియజేయాలన్నారు. ఈ దేవాలయం సందర్శనలో మాస్టర్ మైండ్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్లు సుధాకర్ రెడ్డి, రామకృష్ణ, హరి, శ్రీకాంత్, అభిజిత్, ప్రధానోపాధ్యాయులు అజిత, ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం



ప్రియదర్శిని (ఫైల్)

మియాపూర్: బాలిక అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నర్సింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...విజయనగరం జిల్లాకు చెందిన నాని, అనసూయ దంపతులు కుమార్తె ప్రియదర్శిని(10)తో బతుకుదెరువు కోసం నగరానికి వచ్చారు. మియాపూర్‌లోని కల్వరి టెంపుల్ రోడ్డులో ఉన్న శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో నాని వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. భార్య అనసూయ స్వీపర్‌గా పనిచేస్తుంది. కుమార్తె ప్రియదర్శిని గోకుల్‌ప్లాట్స్‌లోని సూర్య మోడల్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతుంది. ఈ క్రమంలో 9వ తేదీ రాత్రి అందరు భోజనం చేసి పడుకున్నారు. మరుసటి రోజు 10వ తేది ఉదయం 5.30 గంటలకు నిద్రలేచి చూసేసరికి ప్రియదర్శిని కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులు, చుట్టుప్రక్కల, స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అనసూయ మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతులను ఆదుకున్న ఘనత కాంగ్రెస్ పార్టీదే

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

పటాన్‌చెరు టౌన్: రైతులను ఆదుకున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం పటాన్‌చెరు డివిజన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో మద్దతు ధర అడిగిన రైతులను జైల్లో పెట్టిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని విమర్శించారు. రాష్ట్రంలో 7,750 వరి కొనుగోలు కేంద్రాలు రూ.500 బోనస్ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 4,500 వరి కొనుగోళ్ల కేంద్రాలు పెడితే... ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం 7,750 కొనుగోళ్ల సెంటర్లు తెరిచారని, 66 లక్షల ఎకరాల్లో రైతులు వరి పంట వేశారని ఇది చరిత్ర అన్నారు. కార్యక్రమంలో మాజీ పీసీసీ కార్యదర్శి మతిన్, మాజీ సర్పంచ్ సంజీవ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సాయిలు ముదిరాజ్, అక్షిత్, సతీష్ పాల్గొన్నారు.